‘పల్లా’ ఘన విజయం

95,235 ఓట్ల భారీ మెజారిటీ



టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావుకు ధ్రువపత్రం అందిస్తున్న రిటర్నింగ్ అధికారి లక్ష్మారెడ్డి

గాజువాక: గాజువాక ఎమ్మెల్యేగా పల్లా శ్రీనివాసరావు ఘన విజయం సాధించారు. ప్రత్యర్థి గుడివాడ అమర్‌నాథ్‌పై ఆయన 95,235 ఓట్ల మెజార్టీ సాధించారు. 3,33,611 ఓట్లు ఉన్న గాజువాక నియోజకవర్గంలో ఈవీఎంల ద్వారా 2,32,949 ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ల ద్వారా 3,307 ఓట్లు పోలయ్యాయి. మొత్తం 14 మంది అభ్యర్థులు బరిలో నిలిచినప్పటికీ పోటీ టీడీపీ, వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల మధ్యే కొనసాగింది. మొత్తం 306 పోలింగ్ కేంద్రాలలో పోలైన ఓట్ల లెక్కింపును 22 రౌండ్ల ద్వారా నిర్వహించారు. ఇందులో పల్లా శ్రీనివాసరావు (టీడీపీ)కు పోస్టల్ బ్యాలెట్‌తో కలుపుకొని 1,57,703 (67.3శాతం) ఓట్లు పోలవగా, గుడివాడ అమర్‌నాథ్ (వైఎస్సార్‌సీపీ)కు 62,468 (26.66 శాతం) ఓట్లు వచ్చాయి. ఓట్ల సరళిని పరిశీలిస్తే.. పల్లా శ్రీనివాసరావు ప్రతీ రౌండ్‌లోను ఆధిక్యతను చాటారు. ప్రతీ రౌండ్‌కు ఆయన సుమారు 2 వేల నుంచి ఐదు వేల మధ్యలో ఆధిక్యతను సాధించారు. కాగా, ఇండిపెండెంట్ అభ్యర్థి కాకర్లమూడి కృష్ణ ప్రసాద్ మూడో స్థానంలో నిలవగా, ఇండియా కూటమి తరఫున బరిలోకి దిగిన సీపీఎం అభ్యర్థి ఎం.జగ్గునాయుడు నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నారు. ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కె.ఎ.పాల్‌కు 1700 ఓట్లు పోలయ్యాయి.

2019లో..

గాజువాక నియోజకవర్గానికి మూడోసారి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో త్రిముఖ పోటీ నెలకొంది. ప్రముఖ సినీ హీరో, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ గాజువాక నుంచి బరిలోకి దిగడంతో రాష్ట్రంలో అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ ఎన్నికల్లో 1,99,284 ఓట్లు పోలయ్యాయి. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి తిప్పల నాగిరెడ్డి 75,292 (37.78 శాతం), పవన్ కల్యాణ్ 58,539, పల్లా శ్రీనివాసరావు 56,642 ఓట్లు తెచ్చుకున్నారు. ఆ ఎన్నికల్లో 28.42 శాతం ఓట్లతో సరిపెట్టుకున్న పల్లా ప్రస్తుత ఎన్నికల్లో 66.75 శాతం ఓట్లు సాధించి, విజయాన్ని సొంతం చేసుకున్నారు.

2014లో..

2014లో గాజువాక నుంచి పోలైన ఓట్లు 1,88,401. ఇందులో టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావుకు 97,109 (51.54 శాతం), వైఎస్సార్‌సీపీ అభ్యర్థి తిప్పల నాగిరెడ్డికి 75,397 ఓట్లు పడ్డాయి. 21,712 ఓట్లతో పల్లా శ్రీనివాసరావు గెలుపొందారు. ఆ రెండు ఎన్నికల్లో కేవలం ఇద్దరు అభ్యర్థులకు ప్రతీ రౌండ్‌లోను 50 నుంచి 100 లోపు ఓట్లు తేడా కనిపించాయి.

2009లో..

2009లో గాజువాక తొలి అసెంబ్లీ ఎన్నికల్లో చతుర్ముఖ పోటీ నడిచింది. అప్పట్లో 1,53,596 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థి చింతలపూడి వెంకట్రామయ్య 50,994 ఓట్లు (33.20 శాతం), స్వతంత్ర అభ్యర్థి తిప్పల నాగిరెడ్డి 33,087 ఓట్లు తెచ్చుకున్నారు. 17,907 ఓట్ల మెజార్టీతో చింతలపూడి వెంకట్రామయ్య విజయం సాధించారు.

ప్రధాన పార్టీల అభ్యర్థులకు రౌండ్ల వారీగా వచ్చిన ఓట్లు

రౌండ్	టీడీపీ	వైఎస్సార్‌సీపీ	రౌండ్ ఆధిక్యత	తుది ఆధిక్యత
1	8184	2696	5488	5488
2	8863	2649	6214	11702
3	6389	2392	3997	15699
4	4388	2022	2366	18065
5	6389	2642	3747	21812
6	7568	3037	4531	26343
7	6503	2637	3866	30209
8	8219	2908	5311	35520
9	7159	2507	4652	40172
10	7708	3123	4576	44748
11	5785	3528	2257	47005
12	6119	3349	2770	49775
13	7103	3161	3942	53717
14	6566	2084	4482	58199
15	6221	2648	3573	61772
16	7571	2977	4594	66366
17	7909	2629	5280	71646
18	7483	2944	4539	76185
19	7279	3010	4269	80454
20	6834	2916	3918	84372
21	7584	3058	4526	88898
22	7197	2167	5030	93928
పోస్టల్ బ్యాలెట్	2116	939	1177	95235

12 మంది అభ్యర్థులకు దక్కని డిపాజిట్

గాజువాక: గాజువాక అసెంబ్లీ నియోజకవర్గంలో 12 మంది అభ్యర్థులకు డిపాజిట్లు కూడా దక్కలేదు. ఇక్కడినుంచి మొత్తం 14 మంది అభ్యర్థులు పోటీ చేసిన విషయం తెలిసిందే. మొత్తం 3,33,611 మంది ఓటర్లు ఉండగా, ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్లతో కలుపుకొని పోలైన ఓట్లు 2,34,329. పోటీ చేసిన అభ్యర్థులు పోలైన మొత్తం ఓట్లలో 16 శాతం ఓట్లను సాధించగలిగితేనే డిపాజిట్ లభిస్తుంది. ఈ లెక్కన గాజువాక బరిలో నిలిచిన అభ్యర్థులు డిపాజిట్ సాధించాలంటే 37,493 ఓట్లు పొందాలి. టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు 1,57,703 (67.3 శాతం) ఓట్లతో విజయం సాధించగా, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ 62,468 (26.66 శాతం) ఓట్లతో ద్వితీయ స్థానంలో నిలిచారు. మిగిలిన 12 మంది అభ్యర్థుల్లో ఒక్కరికి కూడా డిపాజిట్ రాలేదు. గాజువాక బరిలో నిలిచిన 14 మంది అభ్యర్థులకు పడిన ఓట్లు ఇలా..

క్రమ సంఖ్య	అభ్యర్థి పేరు	పార్టీ	సాధించిన ఓట్లు
1	పల్లా శ్రీనివాసరావు	టీడీపీ	1,57,703
2	అమర్‌నాథ్ గుడివాడ	వైఎస్సార్‌సీపీ	62,468
3	కాకర్లమూడి కృష్ణప్రదీప్	ఇండిపెండెంట్	4,316
4	జగ్గునాయుడు మరడాన	సీపీఎం	3,970
5	కె.ఎ.పాల్	ప్రజాశాంతి పార్టీ	1,700
6	నందికోళ్ల అప్పారావు	బహుజన్ సమాజ్ పార్టీ	1,134
7	తోట అక్కయ్య	లోక్ తాంత్రిక్‌పార్టీ	537
8	కాంద్రేగుల ఆదినారాయణ	జై మహా భారత్ పార్టీ	180
9	సీమకుర్తి శ్రీనివాసరావు	ఇండిపెండెంట్	177
10	సుంకసురి సారాజ్యోతి	నవతరం పార్టీ	138
11	కొవిరి కృష్ణ	ఇండిపెండెంట్	133
12	బత్తుల నీలకంఠం	నవ భారత నిర్మాణ సేవాపార్టీ	127
13	తలుపుల శైలజ	ప్రజాప్రస్థానం పార్టీ	122
14	శామ్యూల్ జాన్ ధర్మరాజు రాయపాటి	దళిత బహుజన పార్టీ	106
	నోటా		1,518

12 నుంచి ‘మిషన్ లైఫ్’

- ఎకో క్లబ్స్ ద్వారా పాఠశాలల్లో పర్యావరణ చైతన్య కార్యక్రమాలు
- ఏపీఎస్‌జీసీ జిల్లా కో–ఆర్డినేటర్ ఖగేశ్వరరావు



అగనంపూడి: ఏపీఎస్‌జీసీ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ప్రతీ పాఠశాలలో మిషన్ లైఫ్ కార్యక్రమం నిర్వహించాలని ఏపీఎస్‌జీసీ అనకాపల్లి జిల్లా కో–ఆర్డినేటర్ శిష్టు ఖగేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర సమగ్ర శిక్షా ఎస్పీడీ ఆదేశాలు, అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ సూచనల మేరకు పాఠశాలల్లో ఎకో క్లబ్‌ల ద్వారా నిర్వహించాలని కోరారు. వీటిలో భాగంగా 5వ తేదీన ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం, వస్తువులు వాడకుండా ఉండడం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేలా ర్యాలీలు నిర్వహించడం, మొక్కలు నాటడం చేయాలని తెలిపారు.

ఇదీ షెడ్యూల్

- 12వ తేదీన నీటిని ఆదా చేయడం, పాఠశాలల్లోని పైప్‌లైన్ల లీకేజీలు అరికట్టడం, నీటి స్వచ్ఛత పరీక్షలు నిర్వహించడం, నీటి సంరక్షణ అవగాహన ర్యాలీలు నిర్వహించాలని తెలిపారు.
- 13వ తేదీన శక్తిని ఆదా చేయడం, విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో విద్యుత్ పొదుపు, ఎనర్జీ టీమ్‌లు, క్లబ్‌లు ఏర్పాటు చేయడం, పోస్టర్లు, బ్యానర్లు తయారు చేయాలన్నారు.
- 14వ తేదీన వ్యర్థాలను తగ్గించడం, పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో శుభ్రత, వ్యర్థాలను వేరు చేయడం, తరగతి గదుల్లో డస్ట్‌బిన్‌లు వాడడం విద్యార్థులకు అలవాటు చేయడం, శానిటరీ వ్యర్థాలతో కంపోస్ట్ ఎరువులు చేయడం, కమ్యూనిటీ సభ్యులతో ఇంటరాక్ట్ అవ్వడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు.
- 15వ తేదీన ఈ వ్యర్థాలను తగ్గించడం, పారిశుధ్య శాఖ ఆధ్వర్యంలో ఈ వ్యర్థాలను సేకరించడం, భూమిపై ఈ వ్యర్థాల ప్రభావంపై పిల్లలతో చర్చించడం చేయాలి.
- 18వ తేదీన స్థిరమైన ఆహార వ్యవస్థ, కిచెన్ గార్డెన్‌ను అభివృద్ధి చేయడం, వ్యర్థాలతో పర్యావరణ అనుకూల ఎరువులు, మొక్కల పెరుగుదల, పర్యావరణ ప్రయోజనాలపై చర్చించడం చేయాలని తెలియజేశారు.
- 19వ తేదీన ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం, నేచర్ వాక్, ప్లాంటేషన్ డ్రైవ్, పర్యావరణ శాస్త్రం, చరిత్ర, భౌగోళిక ఆచారాలు, సంప్రదాయాలను పరిశీలించడం వంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

ఈ కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు చొరవ తీసుకొని ఉపాధ్యాయులు, విద్యార్థులను భాగస్వాములను చేయాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

పూడిక తీశారు.. వదిలేశారు



కల్వర్టు నుంచి తొలగించి రోడ్డుపైనే వదిలేసిన చెత్త

అక్కిరెడ్డిపాలెం: కల్వర్టు నుంచి తీసిన పూడికను రోడ్డుపైనే వదిలేయడంతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. 69వ వార్డు భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద మింది విద్యుత్ సబ్ స్టేషన్ ఎదురుగా గల కల్వర్టు నుంచి భారీగా చెత్తను జీవీఎంసీ మున్సిపల్ సిబ్బంది తొలగించారు. అయితే, చెత్తను సర్వీసు రోడ్డుపైనే ఉంచేయడంతో దుర్గంధంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. అలాగే, రోడ్డు కుచించుకుపోయి వాహనచోదకులకు అవస్థలు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి, చెత్తను రోడ్డుపై తొలగించేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

‘బీజేపీకి రానున్నది గడ్డుకాలమే..’



శిబిరంలో పాల్గొన్న నాయకులు

అగనంపూడి: దేశంలో బీజేపీకి రానున్నది గడ్డు కాలమే అని ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, ఎన్.రామచంద్రరావు అన్నారు. బీజేపీ పాలనకు రానున్న రోజుల్లో నూకలు చెల్లినట్టేనన్నారు. అని ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల్లో 1209వ రోజు, మంగళవారం వారు మాట్లాడారు. తిరుగులేని అధికారంతో విర్రవీగిన బీజేపీ నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరించి లాభాల బాటలో ఉన్న ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేసి, నాశనం చేయాలని చూశారన్నారు. వారికి ఈ ఎన్నికల్లో దేశ ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. ఇప్పటికైనా బీజేపీ, ఎన్డీఏ పక్షాలు కళ్లు తెరిచి స్టీల్‌ప్లాంట్‌ను ఆదుకోకపోతే పుట్టగతులు ఉండవన్నారు. నాయకుడు వి.శ్రీనివాసరావు, ఎంఎంఎస్ఎం, ఎస్టీఎం విభాగాల కార్మికులు పాల్గొన్నారు.

6,7 తేదీల్లో బస్‌పాస్ కౌంటర్ల మూసివేత

ఉక్కునగరం: ఏపీఎస్‌ఆర్టీసీ స్టీల్‌సిటీ డిపోలో ఈ నెల 6,7 తేదీల్లో బస్ పాస్ కౌంటర్లు మూసివేస్తున్నామని డిపో మేనేజర్ చటర్జీ తెలిపారు. బస్‌పాస్ జారీ సాఫ్ట్‌వేర్‌లలో మార్పు చేస్తున్నందున ఆ రెండ్రోజులు కౌంటర్లు పని చేయవన్నారు. 8వ తేదీ నుంచి యథావిధిగా కౌంటర్లు తెరుస్తామని, బస్‌పాస్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

నీట్‌లో మెరిసిన శ్రీచైతన్య విద్యార్థిని



పావనికి స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

ఉక్కునగరం: నీట్ జాతీయ పరీక్షలో గాజువాక శ్రీచైతన్య విద్యా సంస్థల విద్యార్థిని శరగడం పావని అత్యంత ప్రతిభ కనబరిచి మొత్తం 720 మార్కులకు 711 మార్కులు సాధించి ఆలిండియా ర్యాంకు 322 సాధించింది. అదేవిధంగా ఓబీసీ కేటగిరీలో 89వ ర్యాంకు సాధించింది. గంగవరం పోర్టు ఉద్యోగి నాగ గంగారావు, లావణ్య దంపతుల కుమార్తె పావని ఇంటర్‌లో 991 మార్కులతో స్టేట్ ఫస్ట్ సాధించింది. ఈ సందర్భంగా ఆమెను పాఠశాల యాజమాన్యం ప్రతినిధులు అభినందించారు.

పోలీసు దిగ్బంధంలో ఏయూ పరిసరాలు



మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌కు చేరువలో పోలీస్ పికెట్



వాహనచోదకుడికి బ్రీత్ ఎనలైజర్ పరీక్ష చేస్తున్న పోలీసులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం మంగళవారం పోలీసు దిగ్బంధంలోకి వెళ్లిపోయింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈవీఎంలను భద్రపరచడం, ఓట్ల లెక్కింపు ప్రక్రియ వంటివి ఏయూ ఇంజినీరింగ్ కళాశాల వేదికగా సాగాయి. మంగళవారం నిర్వహించిన ఓట్ల లెక్కింపు నేపథ్యంలో మూడో పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి మద్దిలపాలేనికి వెళ్లే రహదారిని పూర్తిగా పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. మద్దిలపాలెం కూడలి వద్ద, మూడో పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసి ప్రతి వాహనాన్ని తనిఖీ చేశారు. ఉదయం ఓట్ల లెక్కింపు కేంద్రాలకు వచ్చిన పోలింగ్ ఏజెంట్లను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతనే లోపలికి పంపారు. వారికి బ్రీత్ ఎనలైజర్ పరీక్ష చేశారు. ఆ తరువాతనే ఏజెంట్లను లోపలికి పంపారు.

- పోటీ చేసిన అభ్యర్థులను సైతం పోలీసులు తనిఖీలు చేశారు. అభ్యర్థి, కారు డ్రైవర్, ఒక సెక్యూరిటీని మాత్రమే లోపలికి అనుమతించారు. మంత్రి గుడివాడ, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణలను సైతం ఇదే విధంగా తనిఖీ చేసి పంపారు.

కూడళ్లలో పహారా

నగరంలో ప్రతి వార్డులో ప్రధాన కూడళ్లు, సమస్యాత్మక ప్రాంతాలలో పోలీసులు పికెటింగ్ నిర్వహించారు. తూర్పు నియోజకవర్గం పరిధిలో సిరిపురం, పెదవాల్తేరు, చినవాల్తేరు తదితర ప్రాంతాలలో పోలీసులు పహారా కాశారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా, ముందు జాగ్రత్తగా ప్రధాన కూడళ్లలో బందోబస్తు నిర్వహించారు.

‘రెండో సారి’ సెంటిమెంట్‌కు బ్రేక్

గాజువాక: గాజువాకలో ఒకసారి ఎమ్మెల్యేగా గెలిచిన వారికి మరోసారి అవకాశం రావడం లేదనే సెంటిమెంట్ ఈ ఎన్నికల్లో బ్రేక్ అయ్యింది. పల్లా శ్రీనివాసరావు గెలుపుతో ఈ అభిప్రాయం పక్కకు పోయింది. 2014 ఎన్నికల్లో మొదటిసారిగా ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయన 2019లో ఓటమిని చవిచూసిన విషయం తెలిసిందే. ప్రస్తుత ఎన్నికల్లో రెండోసారి గెలిచి ఆ అభిప్రాయాన్ని చెరిపేశారు. మొదటి ఎన్నికల్లో 21,712 ఓట్లతో గెలుపొందిన ఆయన ఈ ఎన్నికల్లో దానికి దాదాపు నాలుగున్నర రెట్ల అత్యధిక మెజార్టీతో విజయం సాధించారు. దీంతో రెండోసారి అవకాశం రావడం లేదన్న చర్చకు పరిశీలకులు ఫుల్‌స్టాప్ పెట్టినట్లయింది.

అంతటా నిర్మానుష్యం



నిర్మానుష్యంగా రోడ్డు

మద్దిలపాలెం: ఎన్నికల ఓట్ల కౌంటింగ్ కేంద్రమైన ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మద్దిలపాలెం ముఖద్వారం వద్ద మంగళవారం భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ ముఖద్వారం గుండా కౌంటింగ్ ప్రాంగణంలోకి విశాఖ తూర్పు, ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు అనుమతించారు. కౌంటింగ్ కేంద్రానికి వెళ్లే అభ్యర్థుల వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమతి లేకుండా ఎవరి లోపలికి అనుమతించలేదు. ఈ ముఖ్యద్వారం సమీపంలో 144 సెక్షన్ అమలు చేశారు. నలుగురు కంటే ఎక్కువగా ఎవరూ తిరగకుండా పోలీసులు సూచనలు చేశారు. సుమారు కిలో మీటర్ మేర పోలీసులు గస్తీ ఏర్పాటు చేశారు.

- ఎన్నికల కౌంటింగ్ కారణంగా మద్దిలపాలెం పరిసర ప్రాంతాల రోడ్లు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. రహదారులపై జన సంచారం సైతం అంతంత మాత్రంగా కనిపించింది. దీంతో రోడ్లన్నీ ఖాళీగా కనిపించాయి. మద్దిలపాలెం, పిఠాపురం కాలనీ, కేఆర్ఎం కాలనీ, కృష్ణా కళాశాల, తదితర మార్గాల్లో ఈ పరిస్థితి కనిపించింది. నిత్యం రద్దీగా వాహనాలతో కిక్కిరిసిన మద్దిలపాలెం జాతీయ రహదారి సైతం ఖాళీగా కనిపించింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకపోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

ఘనంగా దుర్గమాంబ మారువారం పండగ



దుర్గమాంబకు పూజలు చేస్తున్న అర్చకుడు

కంచరపాలెం: గొల్లకంచరపాలెం వాసుల ఆరాధ్య దైవం దుర్గమాంబ అమ్మవారి మారువారం జాతర శ్రీరామాసేవా సమాజం(యాదవ్) ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. దుర్గానగర్‌లోని ఆలయంలో ఉదయం నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ నేతృత్వంలో గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు మజ్జిగ, ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం ఆలయ ఆవరణలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు, నేల డ్యాన్సులు నిర్వహించారు. తోటవీధిలో పుట్ట బంగారం నుంచి అమ్మవారి ప్రధాన దేవాలయం వరకు అమ్మవారి ప్రధాన ఘటాన్ని జాతర వేడుకల్లో ఊరేగించారు. గ్రామ ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

టీఎస్సార్, టీబీకే కళాశాలలో రేపు మెగా జాబ్‌మేళా

గాజువాక: వివిధ బ్యాంకులు, సంస్థల్లో ఉద్యోగాల భర్తీకి ఈ నెల 6న స్థానిక టీఎస్సార్, టీబీకే డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆ కళాశాల చైర్మన్ టి.బలరామకృష్ణ తెలిపారు. సెడార్ కెరీర్స్ సౌజన్యంతో ఎస్ బ్యాంక్, యాక్సిక్ బ్యాంక్, ఐసీఐసీఐ, ఎస్‌బీఐ కార్డ్, ముత్తూట్ ఫైనాన్స్, ఫ్లిప్‌కార్ట్, అపోలో ఫార్మసీ, హెల్త్ ఆన్ అజ్ తదితర సంస్థల్లో ఉద్యోగాల భర్తీకి ఈ మేళాలో ఇంటర్వ్యూలను నిర్వహిస్తారన్నారు. డిగ్రీ, ఇంటర్మీడియట్ అర్హతతో 18 నుంచి 30 ఏళ్ల లోపు వయసు గల యువతీ యువకులు ఈ మేళాకు హాజరు కావచ్చని తెలిపారు. ఆసక్తి గలవారు తమ సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు, ఆధార్ కార్డుతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు.

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వి. రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతతకు నిలయం.. ప్రసన్న వేంకటేశ్వరాలయం

- ప్రసన్నగిరిపై కొలువుదీరిన స్వామి
- తొలి పూజలందుకుంటున్న బాల వినాయకుడు
- దాతల సహకారంతో ఆలయ అభివృద్ధి



భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల వేంకటేశ్వర, వినాయక స్వామి దేవస్థానం



ఆలయానికి వెళ్లేందుకు నిర్మించిన నడక, వాహన మార్గం

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ) సిగ్నల్ పాయింట్ వద్ద గల ప్రసన్న గిరిపై ఉన్న ప్రసన్న వేంకటేశ్వర, వినాయక ఆలయాలు సుందరంగా రూపుదిద్దుకుంటున్నాయి. దాతల సహకారంతో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. త్వరలోనే పనులు పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకువస్తామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలియజేస్తున్నారు.

శ్రీకారం చుట్టిన బీహెచ్‌పీవీ ఉద్యోగులు

బీహెచ్‌పీవీ ఉద్యోగులంతా కలిసి సంస్థకు ఎదురుగా ఉన్న కొండపై కొద్దిపాటి ఎత్తులో 1976లో ముందుగా బాలవినాయకుడి ఆలయాన్ని నిర్మించారు. అనంతరం కొండపై ప్రసన్న వేంకటేశ్వరాలయాన్ని నిర్మించారు. అప్పట్లో గాజువాకలోనే కాకుండా నగరంలోనే ప్రసన్న వేంకటేశ్వరాలయం చిన్న తిరుపతిగా ప్రసిద్ధి చెందింది. దీనిని 2002లో దేవదాయ శాఖ స్వాధీనం చేసుకుంది. ఇప్పటికీ ఆలయంలో జరిగే ప్రధాన ఉత్సవాలు, ప్రత్యేక కార్యక్రమాల్లో భెల్ ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారు.

దాతల సహకారంతో అభివృద్ధి

ఆలయాన్ని దాతల సహకారంతో పాలకమండలి సభ్యులు అభివృద్ధి చేస్తున్నారు. వినాయక ఆలయ ముఖద్వారం స్టీల్ గేట్లతో కొత్త రూపును సంతరించుకుంది. గుడి లోపల స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆలయానికి ఇరువైపులా, వెనుక పూర్తిగా మార్బుల్ గచ్చులతో పాటు ఎండ, వానల్లో భక్తులకు ఇబ్బందులు లేకుండా షెడ్డును నిర్మించారు. స్వామి వారి కల్యాణాన్ని వీక్షించే భక్తులకు ఈ షెడ్లు ఎంతో సౌకర్యవంతంగా ఉంటాయని అంటున్నారు. గతంలో వృద్ధులు ఆలయానికి వెళ్లాలంటే మెట్లు ఎక్కడానికి ఎంతో ఇబ్బంది పడేవారు. ఇప్పుడు ఆలయానికి నడక, వాహన మార్గం ఏర్పాటుతో ఎంతో సౌలభ్యంగా మారిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ప్రసన్న వేంకటేశ్వరాలయం చుట్టూ నిర్మించిన షెడ్డులో ఒక భాగం



ప్రసన్న వేంకటేశ్వరాలయం కోసం సిద్ధం చేస్తున్న స్టీల్ గేట్లు



బాల వినాయకుడి ఆలయానికి అమర్చిన స్టీల్ గేట్లు

వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకుడు పవన్‌కుమారాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.